క్లుప్తంగా

తుంగభద్ర పరవళ్లు



కౌతాళం: తుంగభద్ర డ్యాం పరివాహక ప్రాంతంలో విస్తరంగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయం పూర్తిస్థాయిలో నిండిపోయింది. దీంతో అధికారులు తుంగభద్ర నదికి నీరు వదిలారు. ఈ నీరు గురువారం ఉదయం ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మేళిగనూరు వద్ద ప్రవహించడంతో మండలంలో నదీతీరంలో ఉన్న గ్రామాల రైతులు అప్రమత్తమై తమ వ్యవసాయ విద్యుత్ మోటార్లను సురక్షిత ప్రాంతానికి తరలించుకున్నారు. మోటార్లతో పాటు పైపులు కూడ తొలగించుకుంటున్నారు. తుంగభద్ర నదికి 90వేల క్యూసెక్కులు నీరు వదలడం, డ్యాంకు ఇన్‌ఫ్లోను బట్టి నీటి విడుదల మరింత పెరిగే అవకాశం ఉండడంతో నదీ తీర గ్రామాల రైతులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న కౌతాళంలోని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

బడ్జెట్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న అధ్యాపకుడు ఎం. రామకృష్ణ

ఆదోని సెంట్రల్: దేశ, రాష్ట్ర బడ్జెట్ ప్రణాళికలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధ్యాపకులు అయ్యప్ప, బాలస్వామి, రామకృష్ణ అన్నారు. గురువారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024–25వ సంవత్సరం ఆర్థిక బడ్జెట్‌పై కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ అధ్యక్షతన సెమినార్ జరిగింది. వారు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉండే సత్ఫలితాలను అందేంచే బడ్జెట్ అవసరమన్నారు. పేద, మధ్య తరగతి, ధనికవర్గ తారతమ్యాలకు తావు లేకుండా ప్రజల అకాంక్షల మేరకు బడ్జెట్‌ను రూపొందిస్తారని తెలిపారు. కార్యక్రమములో అధ్యాపకులు గోవిందు, యల్లప్ప, నిఖిల్, ఈరన్న, వెంకటరామిరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ సయ్యద్ బాబా ఫరీద్ జయంతి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దర్గా నిర్వాహకులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సిరాలదొడ్డి సబ్–స్టేషన్ సమీపంలో వెలసిన శ్రీ సయ్యద్ బాబాఫరీద్ దర్గాలోని స్వామి 60వ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆస్థానే అలియా ఫక్రి సదర్‌చౌక్ హజరత్ బాబాఫరీద్ దర్గా అవరణలో దర్గా పీఠాధిపతి సయ్యద్ సర్ఫరాజ్‌బాబా, నిర్వహకులు సయ్యద్ ఖాదర్‌బాబా సాహెబ్, ఖాదర్ బాబా సాహెబ్‌ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేసి అనంతరం శ్రీ సయ్యద్ బాబాఫరీద్ సమాధికి ప్రత్యేక ఫాతిహాలు చేశారు. బాబాఫరీద్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు సలీమ్, సాదిఖ్అలీ, జమీర్, చరణ్, ఈరన్న, డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెద్దకడబూరు : మండలంలో నిర్వహించే మొబైల్ ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జనార్దన్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ కేంద్రాలలో అధార్ అప్డేట్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2011 నుంచి 2016 మధ్యలో జరిగిన ఆధార్ ఎన్రొల్‌మెంట్‌లో చాలా వరకు అడ్రస్ ప్రూఫ్ పెట్టకుండా అప్లోడ్ చేయించినారన్నారు. వారిలో చాలామంది ఆధార్ అప్డేట్ చేయించుకున్నా మరికొంత మంది ఇప్పటి వరకు చేయించుకోలేదన్నారు. అలాంటి వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భవనం శిథిలం.. వసతి అధ్వానం

- శిథిలమైన భవనంలో బీసీ బాలుర హాస్టల్ నిర్వహణ
- పెచ్చులూడుతున్న పైకప్పు
- పక్కనే ఉన్న స్కూళ్లో నిద్రిస్తున్న విద్యార్థులు
- మరుగుదొడ్లు లేక అవస్థలు
- తాగునీటికి ఇబ్బందులు



బీసీ బాలుర వసతి గృహం

ఆదోని సెంట్రల్: గ్రామీణ ప్రాంత పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసింది. ఇందులో విద్యార్థులకు విద్యతో పాటు వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. వెనుక బడిన ప్రాంతమైన ఆదోని నియోజకవర్గంలో విద్యార్థులు చదువుకోవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలను అశ్రయిస్తున్నారు. అయితే ఆదోనిలోని బీసీ హాస్టల్‌లో అరకొర వసతులతో విద్యార్థులు తమ విద్యభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. పెచ్చులూడిన గదులు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలు సరిగా లేక సతమతమవుతున్నారు.

270 మంది విద్యార్థులకు వసతి..

ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలో బీసీ బాలుర వసతి గృహం ఏర్పాటు చేశారు. ఇందులో 270 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం 10 గదులు ఉన్నప్పటికీ అందులో చాల గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడిపోయాయి. ఉన్నటువంటి పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఎవరి మీద పడుతాయో తెలియక విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై గతంలో అనేకసార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోలేదనే విమర్శలు వినబడుతున్నాయి.

పాఠశాల గదిలోనే పడక

వసతి గృహంలో గదులు శిథిలమై పైకప్పు పెచ్చులూడి కింద పడుతుండటంతో అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక విద్యార్థులు రాత్రి పూట పండుకోవడానికి పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో రెండు గదులకు పర్మిషన్ తీసుకున్నారు. అక్కడే విద్యార్థులు నిద్రిస్తున్నారు. మరి కొంత మందిని ఓ దాత సహకారంతో రేకుల షెడ్డు నిర్మించి అందులో పడుకోబెడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేక పోవడంతో ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. పారిశుద్ధ్యం, తాగునీరు వంటి సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.



పెచ్చులూడిన పై కప్పు



గదులు శిథిలావస్థకు చేరడంతో వరండాలో పెట్టుకున్న పెట్టెలు

వసతి గృహాల్లో సీట్లకు భారీగా దరఖాస్తులు

విద్యార్థులు చదువుకోవడానికి నియోజకవర్గంలో సరైన సౌకర్యాలు లేవు. చాలమంది నిరుపేదలు బతుకు దెరవు కోసం నిత్యం వలసలు వెళుతుంటారు. దీంతో తమ పిల్లలను వసతి గృహాల్లో వదులుతుంటారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. వసతి గృహాల్లో కేటాయించిన సీట్లు కంటే అధికంగా దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు అనుగుణంగా అదనపు గదులను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ ఉన్నగదులకే మరమ్మతులు చేయించలేని పరిస్థితి. వసతి సౌకర్యాలను మెరుగు పరిస్తే మందికి వసతి కల్పించవచ్చని విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి



బీసీ బాలుర వసతి గృహంలో మరమ్మతులు చేపట్టడానికి రూ. 13,60,000 మంజూరయ్యాయి. త్వరలో పనులను కూడా ప్రారంభిస్తామని అధికారులు చెప్పారు. ప్రస్తుతం పెచ్చులూడుతున్న భవనంలో కాకుండా పక్కన ఉన్న పాఠశాలల్లో రాత్రిపూట పిల్లలను పండుకోబెడుతున్నాము. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విధాలుగా చర్యలు చేపడుతున్నాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులను నిర్మాణం చేపడితే బాగుంటుంది.

– విశ్వనాథరెడ్డి, బీసీ, వసతి గృహం సంరక్షకుడు

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోండి

కోసిగి: మేజర్ పంచాయతీ కోసిగిలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదోని డివిజనల్ పంచాయతీ అధికారిణి నూర్జహాన్ సూచించారు. గురువారం కోసిగిలోని గాంధీనగర్‌లో ఆమె పర్యటించారు. పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షకాలం కావడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందకుండా కాలనీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని కాచి వడబోసి తాగాలని సూచించారు. డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌లను చల్లించాలని, ట్యాంక్‌లను శుభ్రంగా చేయించాలని పంచాయతీ ఈఓ తిరుమలేశ్వ రెడ్డిని ఆదేశించారు. ఆదోని మండలం మండగిరి పంచాయతీ ఈఓ చంద్రశేఖర్, మాణిక్యరాజు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



గాంధీనగర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

అప్రమత్తంగా ఉండాలి

పెద్దకడబూరు : మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ జనార్దన్ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ముస్లిం కమ్యూనిటీ హాల్, ఎంపీడీఓ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా అన్ని మురుగు కాలువలను సర్పంచ్ రామాంజినేయులు ఆధ్వర్యంలో గురువారం శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్‌ను పిచికారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మహేంద్ర, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ విద్యార్థినుల సమస్యలపై విచారణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మైనారిటీ కాలనీలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినుల భోజన సమస్యపై జిల్లా అధికారులు స్పందించారు. గురువారం విద్యాశాఖ ఏడీ శామ్యూల్ పాల్, డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, జీసీడీఓ మేరీ స్నేహలతలు పాఠశాలకు వచ్చి విచారణ జరిపారు. వంటగదిలో పాడైపోయిన కూరగాయలు పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై భోజన సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం సరిపడా పెట్టడంలేదని, అది కూడా అలస్యంగా పెడుతున్నారని, భోజనం సరిగా చేయడం లేదని విద్యార్థినులు వారి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఉడికీ ఉడకని అన్నం వండుతున్నారని అది తినలేక పస్తులుండాల్సి వస్తుందని వాపోయారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, వంటమనుషులతో అధికారులు వేర్వేరుగా సమావేశమై సమస్య జఠిలమైయ్యేందుకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. అయితే దీనికి వంట మనుషులు, వాచ్‌మెన్ల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు ఎస్ఓ కవిత నిర్లక్ష్య వైఖరి కారణమని అధికారులు గుర్తించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఏడీ, డిప్యూటీ ఈఓలు మాట్లాడుతూ పాఠశాలలో తలెత్తిన సమస్యలపై విచారించామని, నివేదికను జిల్లా కలెక్టర్, డీఈఓకు సమర్పిస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ఎంఈఓలు ఆంజినేయులు, మధుసుదన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీలో భోజనంపై విద్యార్థినితో ఆరా తీస్తున్న ఏడీ, డిప్యూటీ ఈఓ

కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

విద్యార్థులకు సరిగా అన్నం పెట్టని కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ కవితను వెంటనే సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు మహేంద్రబాబు, వీరేష్‌యాదవ్, విజయేంద్ర, సురేష్, రాజేష్, శేఖర్, ఉదయ్, సోమశేఖర్, ఖాజ, కృష్ణ, రఘునాథ్, ఆఫ్రిద్, సురేంద్ర, రంగప్ప, విజయ్‌లు డిమాండ్ చేశారు. పాఠశాల ముందు బైఠాయించి ధర్నా చేశారు. విద్యార్థులు సమస్యలు చెప్పకుండా ప్రిన్సిపాల్ భయపెట్టారని ఆరోపిస్తూ విచారణకు వచ్చిన అధికారులతో వాగ్వాదం చేశారు. కాగా ప్రిన్సిపాల్ తమకు ఇచ్చిన సమాచారం, పాఠశాలలో విద్యార్థుల వాస్తవ పరిస్థితులు వేరుగా వున్నాయని జీసీడీఓ తెలిపారు.

మున్సిపల్ అధికారుల తీరు సరికాదు

ఆదోని రూరల్: ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని గృహాల ముందు ఉన్న ఎంక్రోచ్‌మెంట్ స్థలాలను మున్సిపాలిటీ అధికారులు నిర్మూలించే ప్రక్రియ సరైందికాదని ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రమేష్‌యాదవ్ అన్నారు. గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్‌ను కలిసి సమస్యపై మాట్లాడారు. బుధవారం తాను (రమేష్‌యాదవ్) ఊరిలో లేని సమయంలో మున్సిపాలిటీ అధికారులు జేసీబీని తీసుకొచ్చి తన ఇంటి ముందు ఉన్న ర్యాంప్ తొలగించారన్నారు. అదే వీధిలో మున్సిపల్ కమిషనర్ అద్దె గృహంలో ఉంటున్నారని, ఆ ఇంటి ముందు ర్యాంపును ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. కేవలం రాజకీయ పూర్వకంగా ఇలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ సమస్యపై విచారణ చేపడతానని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతి రావు, పట్టణాధ్యక్షుడు సాయినాథ్, విద్యార్థి సంఘం నాయకులు శ్రీనిత్, జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్ పాల్గొన్నారు.

వేతన సవరణ కమిటీకి చైర్మన్‌ను నియమించాలి

ఆదోని సెంట్రల్: వేతన సవరణ కమిటీకి చైర్మన్‌ను నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఎస్టీయూ పట్టణ ట్రెజరర్ జంబులయ్య అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటించడంలో ఆలస్యం జరుగుతుంది కనుక 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీ, ఏపీజీఎల్ఐసీ, జీపీఎఫ్ రుణాలు, పండుగ అడ్వాన్స్‌ల వంటి ఆర్థిక బకాయిలను విడుదల చేయాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రవి, భీమరాజు, వీరేష్, గంగానాయక్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు నిధులు ఇవ్వండి

ఆదోని అర్బన్: పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు సహకారం అందించి నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అభిషిత్‌కిషోర్‌ని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. గురువారం మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో ఎండీని కలిసి ఆదోని పట్టణంలో ఆటోనగర్ ఆవశ్యకత గురించి వివరించారు. ఆటోనగర్ ఏర్పాటు కోసం పట్టణంలో స్థల సేకరణ చేసి వారి సంక్షేమానికి పాటుపడాలని కోరారు.

ఆదోనిలో ఆక్రమణల తొలగింపు

ఆదోని టౌన్: పట్టణంలో అంతా ఆక్రమణలే కనిపిస్తున్నాయని, వాటిని తొలగించేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. గురువారం టౌన్ ప్లానింగ్ అధికారి విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని 42 వార్డుల పరిధిలో ఆక్రమణలు తొలగింపుకు రంగం సిద్ధం చేశామన్నారు. నియమ, నిబంధనల మేరకు ఆక్రమణలను తొలగించాలని, ఎవరినీ ఉపేక్షించవద్దని ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం కొత్త బస్టాండు నుంచి ఎమ్మిగనూరు రోడ్డు వరకు మురుగు కాలువలు, దుకాణాల ముందు వేసిన దుకాణాలను తొలగిస్తున్నామన్నారు. ఎమ్మిగనూరు రోడ్డు టర్నింగ్ నుంచి ఏఎస్ కళాశాల వరకు ఆక్రమణల తొలగింపు పనులు జరుగుతున్నాయన్నారు. మూడో విడతలో పాత బస్టాండు సర్కిల్ నుంచి ఆలూరు రోడ్డులో అక్రమ కట్టడాల పనులు నిర్వహించనున్నామని చెప్పారు. 4వ విడతలో ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్ నుంచి గౌస్ ఆస్పత్రి రోడ్డులోని ఏరియా ఆస్పత్రి వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. మున్సిపల్ స్థలాలను ఆక్రమించుకున్న యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకొని సహకరించాలని కోరారు.



ఎమ్మిగనూరు రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

మంత్రాలయం: కౌలు రైతులు కౌలు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ సూచించారు. గురువారం మండల పరిధిలోని మాలపల్లి గ్రామ సచివాలయంలో కౌలురైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ఎరువులు, విత్తనాలు, పంటల బీమా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓ రాజేశ్వరి, వీఆర్వో రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి జీరా గణేష్

ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఈరమ్మను కొనసాగించాలి

ఆదోని రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పాండవగల్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మని కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి మేటీలు, కూలీలు కోరారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ విజయ శేఖర్‌రావును కలిసి వినతి పత్రం అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న మాట్లాడుతూ 18 సంవత్సరాలుగా ఈరమ్మ పనుల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు లేకుండా నీతీనిజాయితీగా గ్రామంలో అందరికీ పనులు కల్పిస్తూ అందరి మన్ననలు పొందిందన్నారు. అలాంటి ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించడం వల్ల గ్రామంలో పనులు నలిచిపోయి ఉపాధి కూలీలకు నష్టం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షులు రామాంజనేయులు, నాయకులు పాండురంగ, మేటీలు హుసేని, అనంత ఆంజనేయ, హనుమంతరెడ్డి, కూలీలు హుసేని, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మాధవరంలో పారిశుద్ధ్య పనులు



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న డీటీ రాఘవేంద్ర

మంత్రాలయం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాధవరం గ్రామంలో రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గురువారం డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర గ్రామంలో పర్యటించి పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నీటి ట్యాంకులు, తాగు నీటి సరఫరా, వీధి డ్రైనేజీలు, పారిశుద్ధ్య పనులు, ప్రజారోగ్య సమస్యలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని, రోడ్లపై ఉన్న చెత్త దిబ్బలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, వీఆర్వో సాయినవ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జయతీర్థుల ఆరాధన



శ్రీమఠంలో జయతీర్థుల రథోత్సవం

మంత్రాలయం : మధ్వమత మూల సంస్థాన పూర్వపు పీఠాధిపతి జయతీర్థుల ఆరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. కర్ణాటకలోని ఆణుగుంది నవ బృందావన క్షేత్రంలో జయతీర్థులు బృందావనస్థులయ్యారు. గురువారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో శ్రీమఠంలో ఆరాధన వేడుకలు చేపట్టారు. ముందుగా జయతీర్థుల చిత్రపటానికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బంగారు రథంపై జయతీర్థుల చిత్రపటాన్ని శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగించారు. మేనేజర్–1 శ్రీనివాసరావు, మేనేజర్–2 వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ తదితరుల పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సరఫరా చేయండి

కౌతాళం: మండలంలో రైతులకు విత్తనాలు, ఎరువులను వెంటనే సబ్సిడీ ధరలకు సప్లై చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు గురువారం తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్ర, జగదీష్, సీపీఐ మండల కార్యదర్శి ఈరన్న మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలు రైతులకు అందించలేదన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని, మండలంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో హుసేని, హనుమంతప్ప, వెంకప్ప, రమేష్, సన్ని పలువురు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ఆదోని టౌన్: కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం కళాకారులకు ఇస్తున్న రూ.6 వేలు పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన కళాకారులందరికీ కొత్త పింఛన్లను అందించాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీలు కల్పించాలన్నారు. జానపద, భజన కళాకారులకు వాయిద్య పరికరాలు సబ్సిడీపై అందించాలన్నారు. కళాకారులకు పట్టణం, గ్రామాల్లో ఇంటి స్థలాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. కళాకారులు ఇచ్చే ప్రదర్శనలకు ఆర్థిక సాయం అందించాలన్నారు.



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

పూడికతీత పనుల పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గంజిళ్ల రోడ్డులో ఉన్న ప్రధాన మురుగు కాలువలో పూడిక తీత పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో పూడిక పేరుకొని పోవడంలో మురుగునీటి పారుదల సమస్యలు తలెత్తేవన్నారు. పట్టణంలో 77 కిలోమీటర్ల మేర మురుగు కాలువ లున్నాయని వాటిలో ఇప్పటి వరకు దాదాపు 40 కిలోమీటర్ల మేర పూడిక తీత పనులు చేపట్టడం జరిగిందన్నారు. కాలువల్లో పట్టణ వాసులు చెత్తాచెదారం వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీపీఓ గోపాలకృష్ణ, మున్సిపల్ డీఈలు నీరజ, మనోహర్‌రెడ్డి, ఏఈలు మదన్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.



ప్రధాన మురుగు కాలువలో పూడిక తీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్

విద్యారంగ పరిరక్షణ అందరి బాధ్యత

గోనెగండ్ల : ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ సోనిబాయి, ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మద్దిలేటి, చంద్రపాల్‌లు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను 1 నుంచి 5వ తరగతి వరకు యధావిధిగా కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో ఒకే సిలబస్ విధానాన్ని ఒకే పరీక్ష విధానం ఉండాలన్నారు.కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాముడు, వెంకటరమణ, అక్బార్, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

గోనెగండ్ల : ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనిబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశం ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనం ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కోఆప్షన్‌మెంబర్ తప్పకుండా హాజరు కావాలన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

నందవరం : గ్రామాల్లో స్వచ్ఛమైన, పరిశుభ్రత నీరును సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌రావు పంచాయతీ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో పర్యటించి డ్రైనేజీలు, నీటి ట్యాంకుల పరిశుభ్రతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు రోగాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగు కాలువలు, నీటి కుంటలు, వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హెల్త్ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజారోగ్య సమస్యలను తెలుసుకోవాలని, తగు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు చేయాలన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



జిల్లా అధికారిణికి వినతిపత్రం ఇస్తున్న కాత్రికి సర్పంచ్

కౌతాళం: మండల పరిధిలోని కాత్రికి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న నగేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ వెంకప్ప గురువారం కర్నూలు జిల్లా డీపీఓ ఆఫీసులో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కావాలంటే కార్యదర్శికి 20శాతం లంచం ఇవ్వాలని, లేక పోతే బిల్లులు చేయనని కరాఖండింగా చెబుతున్నాడని తెలిపారు. విధులకు కూడా సక్రమంగా హాజరు కావడం లేదని, గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెబితే కులం పేరుతో తనను గతంలో దూషించాడని ఆరోపించారు. గ్రామ ప్రజాప్రతినిధి అయినా పంచాయతీ కార్యాలయానికి వెళితే కనీసం కుర్చీ కూడ వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో ఎలక్ట్రికల్స్ బిల్స్ ఇప్పటి వరకు పెట్టలేదని, శానిటేషన్ బిల్లు కూడా పెండింగ్‌లో ఉందని, సంవత్సర కాలంలో తాగునీరు సరఫరా చేసే మోటార్ కాలిపోతే రిపేరి చేయించానని, ఇప్పటి వరకు బిల్లు పెట్టలేదన్నారు. జిల్లా ఉన్నత అధికారులు ఇతనిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.